కథ

# అర్ధాంగి

-శ్రీమతి కానేటి గ్లోరీ వివేక్

**మాకు పెళ్ళయ్యి నాలుగేళ్ళు కావస్తున్నా మా ఆలూ-మగల మధ్య ఎటువంటి భేదాభిప్రా యాలూ తలెత్తలేదంటే అందుక్కారణం మేమొక ర్నొకరం అర్థం చేసుకొని మసలుకు పోతుండటమే.**

**ఏరోజైనా నాకు ఒంట్లో బాగుండలేదంటే మావారే వంట చేసుకొని లంచ్‌బాక్స్ తీసుకునివెళ్ళి పోతుంటారు**

సెలవు రోజుల్లో పిక్నిక్‌లు, షికార్లు, సినిమాలతో సరదాగా కాలం గడిపేస్తుంటాము. ఇంతవరకు ఎప్పుడూ సమస్యలతో వీధిన పడటం తటస్థించలేదు.

మా అన్యోన్యత అవగాహనల్ని చూసిన మా స్నేహితులైతేనేమి, ఇరుగు పొరుగు వాళ్ళయితేనేమి ఈర్ష్య పడ్తుంటారు. ఒక్క చెప్పుడు మాటలు వినే అలవాటు తప్ప మా వారికి మరేఅలవాటూ లేదనే చెప్పాలి.

మా ప్రక్కన సుబ్బారావు అనే ఒకాయన ఉండేవారు. ప్రస్తుతం ఆయన లేరనుకోండి. చూడ్డానికి నోట్లో నాలుకలేనోడిలా కన్పిస్తారేకాని ఆవులిస్తే ప్రేగులు లెక్క పెట్టేరకం.

ఎప్పుడూ ఎవరో ఒకరిమీద చాడీలు చెప్తూ కాలం వెళ్ళదీయడం ఆయనగారి వ్యాపకాల్లో ఒకటి.


మావారూ సుబ్బారావుగారూ మంచి స్నేహితులు.

ఆయన తన బాధలూ కష్టనిష్ఠూరాలన్నీ మా వారితో చెప్పకుండా ఉండలేరు.

పోనీ ఏదో కష్టాల్లో ఉన్నారుకదా అని ఏదైనా సలహాఇస్తే, వింటారేకాని పాటించే అలవాటు ఏకోశానా లేదు. అలాగని స్నేహితులకు దూరంగా ఉంటారంటే, అదీ ఆయన తరంకాదు.

ఎంతటి కలుపుగోలు మనిషో అంతటి స్వార్థపరుడు కూడా.

ఎవరన్నా సంతోషంగా ఉన్నట్లు ఆయనకు తోచిందో ఎలాగోలా వారి మధ్య మనస్పర్థలు తెచ్చేంత వరకూ కంటిమీద కునుకు తీయడు. అయితే వారి



శ్రీమతి ప్రవర్తన మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఆమె చాలా సౌమ్యురాలు. నిరాడంబరపు మనిషి. ఓ విధంగా చెప్పాలంటే పాతకాలపు మనిషి. వాళ్ళిద్దరి మనస్తత్వాలకు కూడా పొంతన ఉండదు.

ఓరోజు నాక్కాస్త ఒంట్లో నలతగా ఉండి తలుపు గడియతీసిపెట్టి మంచం మీద వాలానో లేదో నాకు తెలీకుండానే నిద్రలోకి జారుకున్నాను.

ఆఫీసునుండి మావారు ఎప్పుడొచ్చారో ఏమో! 'టీ రెడీ అయ్యిందా?' అనికేక వేసేసరికి ఉలిక్కిపడి, తేరుకొని నా పరిస్థితంతా వివరించి. ఎలాగోలా ఈ పూటకి సర్దుకోమని అర్థించాను.

దానికి మావారు...

"సరేనోయ్! దానికేముంది. ఏదైనా నీ ఆరోగ్యం తర్వాతనే కదా!" అన్జెప్పి హుషారుగా టీపెట్టుకొని త్రాగి వంటచేయడానికి ఉపక్రమించి, ఆ పూటకు కావల్సిన వంట సామగ్రంతా రెడీ చేసుకొని స్టౌ మీద కుక్కర్ పెడుతుండగా...

కాలింగ్ బెల్ మ్రోగింది. ఈ సమయంలో ఎవరై ఉంటారనుకుంటూనే మావారెళ్ళి తలుపు తీసి

చూసేసరికి పక్కింటి సుబ్బారావు గారు.

మావార్ని వంటమనిషి గెటప్‌లో చూసి నివ్వెరబోయి. ఆ తర్వాత కాస్త తమాయించుకుని అరువు తెచ్చుకున్న నవ్వుతో...

"ఏమిటి వివేక్ జీ! ఈ రోజేదో వెరైటీగా కన్పిస్తున్నారే! ఇంతకీ మా సిస్టర్‌కేమయింది?" అంటూ పలకరించటానికి నా మంచం దగ్గరికి రాబోయారు.

"ఆ... అదేం లేదు కొంచెం నలతగా ఉంటేనూ..." సంభాషణను పొడిగించడం ఇష్టం లేక కాబోలు మావారు ముక్తసరిగా సమాధానం చెప్పారు.

"అలాగనా...! అదిసరేగాని... మీ కర్జం-టుగా ఓ విషయం చెప్పాలి ఓ నిముషంపాటు డ్రాయింగ్ రూంలోకి రాకూడదూ" తగ్గుస్వరంతో అన్నారు సుబ్బారావుగారు.

"అదేదో ఇక్కడే చెప్పొచ్చుగా" అతిసహజ ధోరణిలో అన్నారు మావారు.

"అదిక్కడ చెప్పే విషయం కాదు లెండి!"

"సరే! మీ ఇష్టప్రకారమే కానివ్వండి" అని ఇద్దరూ డ్రాయింగ్ రూంకెళ్ళారు. ఇద్దరూ ఏ విషయమో చిన్నగా మాట్లాడుకోవడం విన్పించింది.

అయినా వాళ్ళ మాటలు నాకు విన్పిస్తూనే ఉన్నాయి.

"వ్వాట్ వివేక్‌జీ! ప్రతీ చిన్న విషయానికి ఇలా సర్దుకుపోతే ఎలా? మనం ప్రతీదానికి ఇలాగే మౌనం వహిస్తే మనల్ని పర్మినెంట్ వంట మనుష్యులుగా చేస్తారీ ఆడవాళ్ళు. అయినా చీటికి మాటికి తలనొప్పనీ, కాళ్ళ నొప్పనీ మంచం ఎక్కితే ఎలా? నన్నే చూడండి మీ సిస్టర్‌కి ఎంత ఆరోగ్యం బావుండకపోయినా, సరే పచ్చి మంచినీళ్ళయినా ముట్టను. అదంతా ఎందుకు... ఇందాక మీ ఇంటికి రాబోతూంటే ఏదో పని చెప్పింది. 'చేసుకుంటే చేసుకో లేకపోతే చావు' అంటూ ఇలా ఎగిరొచ్చాను. అయినా ఆమెకు నాకు చెప్పేంత ధైర్యం ఎక్కడేడ్చింది? మగాళ్ళన్న తర్వాత ఆ మాత్రం డిగ్నిటీ మెయింటెన్ చెయ్యక పోతే ఎలా? ఇవన్నీ మీకు తెలియక కాద-నుకోండి. ఇవన్నీ రోజూ ఉండేవేకాని అర్జంటుగా డ్రెస్ వేసుకొని రెడీకండి, టౌన్లో మాంచి ఇంగ్లీషు ఫిల్మ్ వచ్చింది. ఈ రోజు ఆఖరాటట.

అంతే కనీసం నాకో మాటన్నా చెప్పకుండా డ్రస్సు వేసుకుని సిన్మాకి ఉడాయించారు మా శ్రీవారు.

ఇక తప్పని పరిస్థితుల్లో వంట చేయాల్సి వచ్చింది. నిజం చెప్పొద్దు సినిమా చూసి ఇంటికొచ్చిన మా వారి మీద మాచెడ్డకోపం వచ్చింది. అయినా ఎంతో నిగ్రహించుకోగలిగాను. ప్రశాంతంగా ఉన్న సంసారంలో సమస్యల్ని కొని తెచ్చుకోవడం ఇష్టంలేక మౌనం వహించాను.

ఈ సంఘటన జరిగిన వారం రోజుల తర్వాత ఓరోజు మా ఇంటికి తెల్సిన స్నేహితురాలొస్తే వేడి-వేడిగా పకోడీలు తినిపిద్దామని వంటింట్లోకెళ్ళి శెనగపిండి డబ్బా మూత తీసి చూశాను. అది నిండుకొని ఉంది. ఇక అత్యవసర పరిస్థితిలో చేసేదేమీలేక సుబ్బారావుగారింటికి చేబదులుకెళ్ళాల్సి వచ్చింది. వాళ్ళింటికి వెళ్ళాను.

కాలింగ్‌బెల్ నొక్కానోలేదో లుంగీ. బనీను ధరించి భుజంపై టవల్ వేసుకొని. చేత్తో కూరగరిట పట్టుకొని అచ్చం కాకాహోటల్‌లో పనిచేసే వంట మనిషి రూపంలో దర్శనమిచ్చారు సుబ్బారావు.

సుబ్బారావుగార్ని ఆ గెటప్‌లో చూసిన నాకు కొంచెం విస్మయంతో పాటు కోపంకూడా వచ్చింది.

మా ఆవిడకు ఒంట్లో ఎంత బాగుండక పోయినా పచ్చి మంచినీళ్ళయినా ముట్టనంటూ ప్రగల్భాలు పల్కిన పెద్ద మనిషి ఇతనేనా! అయినా నా భర్త నాకు సహాయం చేస్తుంటే మధ్యలో ఇతనికెందుకింత బాధ. ఇదికూడా ఓ రకం శాడిస్టు మెంటాలిటీ.

ఏం మనుషులో ఏంటో! అని మనస్సులో అనుకొని సుబ్బారావుగారి మనసులోని భావాల్ని గమనించాలన్న ఉద్దేశంతో...

"ఏం అన్నయ్యగారూ వంట పని మీరే చేస్తున్నారేంటి? మా వదిన ఇంట్లోలేదా!" అన్నాను కొంచెం సానుభూతిని ప్రదర్శిస్తూ.

'అదేం లేదమ్మా! కాకపోతే కాస్త తల నొప్పిగా ఉంటేనూ"... అంటూ నీళ్ళు నమలసాగారు.

అంతలోనే నేనందుకుని...

"ఆలూమగలన్న తర్వాత కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలి. అదే జీవితానికి అర్థం - పరమార్థం. గత జన్మలో మా వదిన ఎంత పుణ్యం చేసుకుంటే ఈ జన్మలో మీ లాంటి వారు భర్తగా దొరికారు చెప్పండి." అని మెచ్చుకొన్నాను. అంతటితో ఆగకుండా మా వార్ని దులపడం ప్రారంభించాను.

"నా వెర్రికాకపోతే ఒకరి అదృష్టాన్ని మరొకరు కోరుకుంటే వస్తుందా ఏంటి! నా విషయమే చూడండి. పొలమారింది కాస్త మంచినీళ్ళివ్వడంటే మావారిచ్చేది లేనేలేదు సరికదా! పైగా అటువంటి ఆడంగి పన్లు మా ఇంటావంటా లేనేలేవంటారు. అయినా నిన్న మొన్నటి వరకూ మావారు మీలాగానే అన్ని విషయాల్లోనూ చేదోడు వాదోడుగా ఉండేవారు. ఈ మధ్య ఎవరేం చెప్పారో ఏమో! కనీసం పూచిక పుల్ల సాయమైనా చేయట్లేదు.

సుబ్బారావుగారి ముఖం రంగులు మారుతోంది. ఏదో తప్పు చేసినోడిలా సూటిగా నా ముఖంలోకి చూసి మాట్లాడటానికి చాలా ఇబ్బంది పడ్తున్నాడు.

బుద్ధొచ్చినట్లుందనుకొని, ఇక ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక వచ్చిన పని ముగించుకొని తేలిక పడ్డ మనస్సుతో ఇంటికొచ్చి కూనిరాగం తీస్తూ పకోడి తయారుచేయడంలో నిమగ్నమయ్యాను. ✪

